సాక్షి చిత్తూరు

శనివారం । 27 । జనవరి । 2024



స్వగృహ స్వప్నం..సాకారం

పలమనేరు నియోజకవర్గంలోని పేదల సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజం చేసింది.

- 8లో



ఉప్పొంగే శక్తి.. దేశభక్తి

చిత్తూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి.

- 8లో



వైఎస్సార్ సీపీలో చేరిక

చిత్తూరు నగరంలోని మురకంబట్టులో టీడీపీ మద్దతుదారుల 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

- 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లి: బోయ కొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులు, పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో 10.30 నుంచి 12 గంటల నడుమ రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారికి పూజలు చేయించారు. మహిళలు ఉపవాసదీక్షలతో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఊహించని రీతిలో ఆలయంలో అభిషేక పూజలకు రద్దీ నెలకొంది. ఉభయకర్తలకు చైర్మన్, ఈఓ ప్రసాదాలు పంపిణీ చేశారు. గంగమ్మ ఆలయం వద్ద ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో సుమారు 2 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు.

రోడ్ల అభివృద్ధికి రూ.1.8 కోట్లు

పిచ్చాటూరు: రోడ్ల అభివృద్ధికి తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి నిధుల నుంచి రూ.1.80 కోట్లు విడుదలైనట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మొత్తం ఐదు పనులు మంజూరు చేయగా అందులో నాలుగు పనులు సత్యవేడు నియోజకవర్గంలోనే ఉన్నాయి. బుచ్చినాయుడుకండ్రిగ మండలం, సంతవేలూరు నుంచి సూళ్లూరుపేట వరకు బీటీ రోడ్డు మరమ్మతు, అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు, సత్యవేడు మండలం, వీఆర్ కండ్రిగ నుంచి టీపీపాళెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు, వరదయ్యపాళెం మండలంలోని చిన్నపాండూరు నుంచి వరదయ్యపాళెం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు, తొట్టంబేడు మండలంలోని బైరాజుకండ్రిగ నుంచి కొత్తకండ్రిగ వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరైనట్టు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమన్వయం.. ప్రగతిపథం

- సంక్షేమం, అభివృద్ధి, ఉన్నత జీవన ప్రమాణాలే లక్ష్యం
- ఆరోగ్యమే మహాభాగ్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- ఘనంగా గణతంత్ర దిన వేడుకలు





గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జాతీయపతాకం ఎగుర వేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సమన్వయంతో అడుగులు వేసి చిత్తూరు జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిద్దామని కలెక్టర్ సగిలి షణ్మోహన్ అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ఉన్నత జీవన ప్రమాణాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో శుక్రవారం ఘనంగా గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ షణ్మోహన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డితో కలిసి పరేడ్‌ను వీక్షించి, సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర, సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో జిల్లా జడ్జి భీమారావ్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా అటవీ శాఖాధికారి చైతన్యకుమార్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, నగర మేయర్ అముద, వైస్‌చైర్మన్ రమ్య, డీఆర్వో రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఏఓ కులశేఖర్, ఆర్డీఓ చిన్నయ్య, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ సందేశం ఆయన మాటల్లోనే..

- ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అనుసంధానం చేసి, జిల్లాలోని 32 మండలాల్లో 44 సంచార వాహనాలతో 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో 495 క్యాంప్‌లు నిర్వహించాం. 1,79,698 మందికి ఉచితంగా చికిత్సలు అందించాం.
- జిల్లాలో 1,66,473 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను అందించాం. ఏప్రిల్ 2022 నుంచి ఇప్పటి వరకు 72 ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో 49 వేల మందికి ఉచిత శస్త్ర చికిత్స లు చేసేందుకు రూ.98 కోట్లు ఖర్చు, ఆరోగ్య ఆసరాలో 73,066 మందికి రూ.47 కోట్లు ఖర్చు చేశాం.
- జగనన్న గోరుముద్ద పథకంలో జిల్లాలోని 2,446 ప్రభుత్వ పాఠశాలల్లో 1,64,051 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. 1,670 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశాం.
- రూసా పథకంలో రూ.14 కోట్లతో కుప్పం ద్రావిడ వర్సిటీలో అదనపు తరగతి గదులు, కార్వేటినగరం డిగ్రీ కళాశాలలో రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- చిత్తూరులో రూ.కోటితో బ్లడ్‌బ్యాంక్ భవనం , రూ.90 లక్షలతో బీసీ భవనం, కుప్పంలో రూ.కోటితో అగ్నికులక్షత్రియ, రూ.2 కోట్లతో వాల్మీకి భవనం నిర్మిస్తున్నాం.
- అమ్మఒడి పథకంలో 2023–24లో జిల్లాలో 2,44,706 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.229 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.
- నాడు–నేడు రెండో దశలో రూ.450 కోట్లతో 1,180 పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలల్లో భవనాల ఆధునికీకరణ పనులు చేపట్టాం.
- రైతు భరోసా పథకంలో 2,31,144 మంది రైతు కుటుంబాలకు రూ.174 కోట్లు, పీఎం కిసాన్‌లో 2,29,850 మంది రైతు కుటుంబాలకు రూ.91 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఆహార పంట రుణాల లక్ష్యం రూ.6,343 కోట్లు కాగా రూ.5,351 కోట్లు, వాణిజ్య పంట రుణాల లక్ష్యం రూ.3,470 కోట్లు కాగా రూ.2,367 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.
- జిల్లాలో 48,446 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తూ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉంది.
- నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం మొదటి దశలో 73,584 గృహాలకు మొత్తం రూ.1325 కోట్లు కేటాయింపు జరిగింది. ఇప్పటివరకు 70,115 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా, అందులో 66,454 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోనే ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణానికి రూ.934 కోట్లు ఖర్చు చేసి మొదటి స్థానంలో ఉన్నాం.
- రాయలసీమ డ్రాట్ మిటిగేషన్ ప్రోగ్రాంలో జీఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా జిల్లాలోని పడమటి మండలాలకు తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టాం. 3 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించేందుకు రూ.2144.50 కోట్లతో పరిపాలన అనుమతు లు మంజూరు చేయగా వాటి నిర్మాణం పురోగతిలో ఉంది.
- సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో 2023–24లో రూ.9.23 కోట్ల లక్ష్యంతో పండ్ల తోటల విస్తరణ పథకం కింద 767.28 హెక్టార్లలో కొత్త రకాల పూలసాగు, 1.6 హెక్టార్లలో పాలీ హౌస్‌లు, షెడ్‌నెట్ హౌస్‌ల్లో కూరగాయలు, పూలసాగుకు చర్యలు.
- మహిళా సాధికారతే లక్ష్యంగా జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 15,060 ఎస్‌హెచ్‌జీలకు రూ.1,429 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీనిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 27,539 స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.183 కోట్ల రుణ సౌకర్యం కల్పించాం.
- వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడతలో గ్రామీణ ప్రాంతాల్లోని 2,70,788 మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ఖాతాలకు రూ.284 కోట్లు జమ చేశాం.
- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా నాలుగో విడతలో 436 మందికి రూ.3.53 కోట్లు పంపిణీ చేశాం.



గణతంత్ర దినోత్సవంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

పురస్కారం.. నమస్కారం



అవార్డు అందుకుంటున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి



జయభారతి, గురుకులం జిల్లా కో ఆర్డినేటర్, మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, వెంకటరమణా రెడ్డి, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ, మధుసూదనరెడ్డి, ఉద్యానవన శాఖ, వెంకటేశ్వరన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్




శ్రీలక్ష్మీ, అడిషనల్ ఎస్పీ, సెబ్



సుధాకర్, ఏఎస్పీ అడ్మిన్



నాగేశ్వరరావు, ఏఎస్పీ, ఏఆర్



సుధాకర్ రెడ్డి, డీఎస్పీ, పలమనేరు




శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ ఎస్బీ, చిత్తూరు



శ్రీనివాసమూర్తి, డీఎస్పీ. చిత్తూరు



రవికుమార్, డీఎస్పీ,నగరి



బాబుప్రసాద్, డీఎస్పీ,దిశా



మురళిధర్, డీఎస్పీ, ఏఆర్



రవిరాజు,డీఐవో, వైద్యఆరోగ్యశాఖ

ప్రజలకు అందుబాటులో ఉండి, వారి పురోభివృద్దే ధ్యేయంగా పనిచేశారు. లక్ష్యసాధనలో ఆటుపోట్లు ఎదురైన కఠోర శ్రమ.. నిబద్ధత.. వృత్తిపై అంకిత భావంతో పనిచేశారు. ఫలితం.. పురస్కారం వారికి నమస్కారం చేసింది. అంకిత భావంతో పనిచేసిన 170 మందికి అవార్డులు వచ్చాయి. శుక్రవారం చిత్తూరు పరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందజేసిన అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. – చిత్తూరు కలెక్టరేట్



సునీల్, ఆర్టీఓ, చిత్తూరు



నగరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి



వెంకట రవి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ



మల్లీశ్వర్‌రెడ్డి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ

జూనియర్ సివిల్ జడ్జిగా ప్రశాంత్



ప్రశాంత్, జూనియర్ సివిల్ జడ్జి

తిరుపతి లీగల్: తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న పల్లెపాగు ప్రశాంత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి వివరాలను రాష్ట్ర హైకోర్టు విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సీనియర్ ఏపీపీగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన పల్లెపాగు శ్రీనాథ్ కుమారుడు ప్రశాంత్. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా కోర్సు చదివారు. 2017లో న్యాయవాదిగా తిరుపతిలో ప్రాక్టీస్ ప్రారంభించారు. తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. జూనియర్ సివిల్ జడ్జిగా ప్రశాంత్ మెరిట్‌లో ఎంపిక కావడంపై తిరుపతి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజలు, వెనుకబడిన వర్గాల ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సంక్షేమమే పరమావధిగా పాలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- రూ.1.08 కోట్ల నిధులతో ఇరుగువాయి రోడ్డు
- పనులు ప్రారంభించిన మంత్రి ఆర్కేరోజా

నగరి : ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రస్తుతం పాలన కొనసాగుతోందని, అభివృద్ధి అంటే గత పాలకుల్లా మాటలకో..కాగితాలకో పరిమితం కాకుండా తాము చేతల్లో చూపుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. నగరి–నాగలాపురం రోడ్డు నుంచి ఇరుగువాయి గ్రామం వరకు రూ.1.08 కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ (బీటీ) రోడ్డు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించి, పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమ్యే పనులను చేసిపెట్టడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. గత పాలకుల్లా అరచేతిలో వైకుంఠం చూపుతూ ప్రజలను మభ్యపెట్టడం తమకు చేతకాదన్నారు. తాము చేపట్టే అభివృద్ధి చేతల్లోనే కనిపిస్తుంది తప్ప మాటల్లో కాదన్నారు. ప్రస్తుతం నగరి–నాగలాపురం రోడ్డు నుంచి ఇరుగువాయి వరకు రెండు కిలోమీటర్ల దూరం నిర్మించే ఈ రోడ్డు గోవిందప్పనాయుడు కండ్రిగ, గోవిందప్పనాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇరుగువాయి, ఇరుగువాయి ఎస్సీకాలనీ, ఆరూరు, ఆరూరు సెంటర్‌లోని సుమారు 600కు పైగా కుటుంబాలకు ఉపయోగపడుతుందన్నారు. ఎన్నో ఏళ్ల ఎదురుచూపైన రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, వైఎస్సార్‌సీపీ నిండ్ర మండల కన్వీనర్ వేణురాజు, నాయకులు దామునాయుడు, మురళి, మధు, గోవింద, శేఖర్, రఘు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మురకంబట్టులో టీడీపీ మద్దతుదారుల 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శుక్రవారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్ని ఆధ్వర్యంలో విజయానందరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి, అందరూ మళ్లీ ఆ పాలనే కావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాల నుంచి వైఎస్సార్ సీపీలో భారీ సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయన్నారు.

కారు సహా ఎర్రచందనం స్వాధీనం

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె బస్టాప్ వద్ద ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని అప్పినపల్లి బస్టాప్ వద్ద ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి వాహనాలు చేపట్టారు. ఈ క్రమంలో పలమనేరు వైపు నుంచి స్కార్పియో అటు వైపుగా వచ్చింది. అ కారులోని దుండగులు పోలీసులను చూసి, కారు వదిలి పారిపోయారు. కారును తనిఖీ చేయగా అందులో రూ.15 లక్షల విలువ చేసే 150 కిలోల బరువున్న 7 ఎర్ర చందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతో సహా ఎర్ర చందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ఇద్దరు వ్యక్తులపై వ్యభిచారం కేసు

పుంగనూరు: పట్టణంలోని సూర్యనగర్‌కు చెందిన పుష్ప, వనమలదిన్నెకు చెందిన హరిపై వ్యభిచారం కేసు నమోదు చేసినట్లు శుక్రవారం సీఐ రాఘవరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. పుష్ప అనే మహిళ హరితో కలసి బయట ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించేది. ఈ మేరకు సమాచారం అందడంతో నిఘా ఉంచి, వారిని పట్టుకున్నారు. తిరుపతికి చెందిన మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ మేరకు హరి, పుష్పలపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

స్వగృహ స్వప్నం.. సాకారం

మనకంటూ ఓ ఇల్లుంటే.. అది మన సొంతమైతే..బతుకు బండి ధీమాగా నడిపించవచ్చు.. మనశ్శాంతిగా మనుగడ సాగించవచ్చు.. ఇదీ సామాన్య, మధ్యతరగతి మానవుడి చిరకాల స్వప్నం.. గూడు కట్టుకునే స్తోమత లేని పేదల కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేస్తోంది. అర్హులందరికీ నిలువ నీడ కల్పించాలన్న సదుద్దేశంతో ప్రస్తుత సర్కారు 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకం అమలు చేసింది. అత్యాధునిక సదుపాయాలతో జగనన్న కాలనీలు నిర్మించి, ఆశ్రయం కల్పిస్తోంది. నిరుపేదలందరికీ సొంతింటి కల తీర్చుతోంది.

- పలమనేరు నియోజకవర్గంలో 13,307 ఇళ్ల మంజూరు
- పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు 12,723
- బొమ్మిదొడ్డి లేఅవుట్‌లోనే మూడు వేల ఇళ్లు
- జగనన్న కాలనీలకు వెచ్చించిన మొత్తం రూ.177 కోట్లు



పలమనేరు మండలంలోని సముద్రపల్లి ఎస్సీకాలనీ

పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డి జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

పలమనేరు: సొంతిల్లు కట్టుకోవాలన్నదే ప్రతిపేదవాని కల. ఎలాంటి పరిస్థితి ఉన్నా ఉండేందుకు గూడు ఉండాలన్నదే వారి ఆశయం. పలమనేరు నియోజకవర్గంలోని నిరుపేదల కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాన్ని మంజూరు చేయాలనే తలంపుతో నియోజకవర్గంలో 13,307 ఇళ్లను మంజూరు చేసింది. వీటిల్లో 9వేల ఇళ్లు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. ఇవిగాక ఇంటి స్థలం ఉండి దానికి హక్కు లేని వారిని గుర్తించి వారికి మొత్తం 12,723 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వీటిలో కొందరు పక్కా ఇళ్లకు దరఖాస్తు చేసుకుని, మంజూరు కావడంతో గృహాలు నిర్మించుకుంటున్నారు. గత టీడీపీ పాలనలో పంచాయతీకి నాలుగైదు ఇళ్లను మంజూరు చేశారు. అవి కూడా జన్మభూమి కమిటీలు లేదా వారికి కావాల్సిన వారికి మాత్రమే అందాయి. వాటికి ఇంకా బిల్లులు కూడా ఇవ్వని పరిస్థితి. కానీ నేటి జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా పక్కా ఇళ్లను మంజూరు చేశారు. వీటి నిర్మాణాలకు రూ.177 కోట్లను వెచ్చించారు.

మరో మినీ పట్టణాలు

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న జగనన్న ఇళ్ల కార్యక్రమంతో జగనన్న ఊర్లు వెలుస్తున్నాయన్నది అక్షరసత్యం. జిల్లాలోని పలమనేరు పట్టణ సమీపంలోని నిర్మిస్తున్న బొమ్మిదొడ్డి జగనన్న లేఅవుట్ ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. పలమనేరు మున్సిపాలిటీ జనాభా దాదాపు 60 వేల వరకు ఉంది. ఇక్కడ మొత్తం 14 వేల ఇళ్లు ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం పలమనేరు మున్సిపాలిటీలో బొమ్మిదొడ్డి జగనన్న లేఅవుట్‌లో 3 వేల ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఇదే కాలనీలో మరిన్ని ఇళ్ల నిర్మాణానికి స్థలం కూడా అందుబాటులో ఉంచారు. అంటే మొత్తం పలమనేరు పట్టణం లాగే ఇక్కడ మరో మినీ పలమనేరు తయారైనట్టే. ఇది కేవలం బొమ్మిదొడ్డి లేఅవుట్ మాత్రమే. ఇక మున్సిపాలిటీపరిధిలోని బొమ్మిదొడ్డి, గంటావూరుల్లోనూ ఇళ్ల నిర్మాణాలు జరిగాయి.

ప్రైవేటు వెంచర్లను తలపించేలా..

ప్రైవేటు వెంచర్లను తలదన్నేలా పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి జగనన్న కాలనీ లేఅవుట్ తయారైంది. మంచి వాతావరణం, పక్కా వాస్తు కలిగిన స్థలంలో కాలనీ ఏర్పాటైంది. లేఅవుట్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా 30 అడుగుల రోడ్లు, పూర్తి స్థాయిలో విద్యుత్ వసతి, తాగునీటి కోసం కొత్తగా బోర్లు, వాటికి మోటార్లను అమరిక, నీటి నిల్వకు సింథటిక్ ట్యాంకులను సైతం ఏర్పాటు చేశారు. ఇక వీధుల అభివృద్ధి పనులను, డ్రైన్లు చేపట్టనున్నారు. నియోజకవర్గంలో ఇలాంటివి మరో 12 లేఅవుట్లున్నాయి.

ఇళ్ల వివరాలివీ..

మండలం	మంజూరైనవి	పూర్తయినవి
బైరెడ్డిపల్లె	1,993	1,337
గంగవరం	1,704	1,218
పలమనేరు	1,227	1,000
మున్సిపాలిటీ	3,338	2,200
పెద్దపంజాణి	1,732	1,273
వీకోట	3,313	2,000
మొత్తం	13,307	9,028

సొంతిల్లు కట్టుకున్నాం



ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లోనే ఉన్నాం. ఈ ప్రభుత్వంలో ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి సకాలంలో బిల్లులందాయి. దీంతో ఇంటిని నిర్మించుకున్నాం. మాకు సొంతిల్లుంది. ఇది మాకు చాలా సంతోషంగా ఉంది. నా కంటూ సొంత ఇంటి కలను నెరవేరింది. ఎవరెన్ని మాట్లాడినా నా సొంతింటి కల జగనన్న ద్వారానే నిజమైంది.

– ఫాజియ, జగనన్న లేఅవుట్, పలమనేరు

ఇల్లు మంజూరు



సొంతిల్లు కట్టుకోవాలని అనుకుంటూనే ఉన్నాం. కానీ పేదరికం కారణంగా వీలు కాలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వచ్చి మీరు ఇంటికి దరఖాస్తు చేసుకోండని చెప్పి మంజూరు చేసేందుకు కృషి చేసింది. ఇప్పుడు మా కంటూ ఇల్లుంది. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గౌతమి, శంకరరాయలపేట, పెద్దపంజాణి మండలం

జగనన్న పుణ్యంతోనే ఇల్లు



ఇంతకుముందు ఇల్లు లేదు. అదే బాధగా ఉండేది. ఈ ప్రభుత్వంలో జగనన్న ఇల్లు మంజూరైంది. దీంతో ఇల్లు కట్టుకుని అందులోనే మేము కాపురం ఉంటున్నాం. ఇల్లును చూసినపుడల్లా జగనన్న పుణ్యమాని ఇల్లు సొంతమైందనే ఆనందం. ఇదే కాదు ఇంకా పలు పథకాలు వస్తున్నాయి. దీంతో సంతోషంగా ఉన్నాం.

– గిరిజమ్మ, కీలపట్ల, గంగవరం మండలం

బాడుగ బాధ లేదు



నేను టైలరింగ్ పనిచేసుకుంటూ అద్దె ఇంట్లో ఉండి ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నా. ఇలాంటి సమయంలో ఇల్లు కట్టుకోవడం కుదరలేదు. ఈ ప్రభుత్వంలో కరిపల్లె లేఅవుట్‌లో పక్కా ఇల్లు మంజూరైంది. ఇంటిని నిర్మించుకున్నా. ఇప్పుడు మనసుకు హాయిగా ఉంది. ఇన్నాళ్లకు నెలనెలా బాడుగ కట్టే బాధ తప్పింది.

– గాయత్రి, స్కూల్‌వీధి, వి.కోట

కాలనీ విలువ భవిష్యత్తులో తెలుస్తుంది



బొమ్మిదొడ్డి జగనన్న లేఅవుట్ నియోజకవర్గంలోనే పెద్దది. ఇది మినీ పలమనేరుగా చెప్పుకోవచ్చు. ఇంత పెద్ద ప్రాజెక్టు అయినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే మౌలిక సదుపాయాల కల్పన సాగుతోంది. మరో ఏడాది తర్వాత ఈ కాలనీని చూడండి. అప్పుడు తెలుస్తుంది కాలనీ విలువ. జగనన్న కాలనీ ఇంత బాగుందా అని ఎవరైనా అనుకోవాల్సిందే.

– రమేష్‌రెడ్డి, డీఈఈ, హౌసింగ్, పలమనేరు

జిల్లా కెమిస్ట్, డ్రగిస్ట్ సంఘం ఏకగ్రీవం



జిల్లా కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్: జిల్లా కెమిస్ట్, డ్రగిస్ట్ సంఘం నూతన అధ్యక్షుడిగా నరేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరులోని ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం నూతన కమిటీ ఎన్నికల ఉనిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా బాబునాయుడు, కోశాధికారిగా రాజప్పశెట్టి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, వారిని సన్మానించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రత్నం మాట్లాడుతూ జిల్లాల పునర్ వ్యవస్థీకరణ తర్వాత రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరు జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించామన్నారు. ప్రతి జిల్లాలోనూ కొత్త కార్యవర్గాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, చిట్టిబాబు, శివకుమార్, నరసింహులు, మోహన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అదృశ్యం



వరదమల్లై



రాఘవేంద్ర

రామకుప్పం: స్థానిక ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు ప్రిన్సిపల్ రమేష్ శుక్రవారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని పంద్యాల మడుగు పంచాయతీ కావలిమడుగుకు చెందిన రాజేంద్ర కుమారుడు వరదమల్లై, రాజప్ప కుమారుడు రాఘవేంద్ర గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. గురువారం ఉదయం ప్రార్థన అనంతరం విద్యార్థులు ఇద్దరూ కనిపించకుండా పోయారు. పాఠశాలలో గాలించిన అనంతరం ప్రిన్సిపల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ మేరకు సమాచారం అందజేశారు. గురువారం రాత్రి వరకు విద్యార్థుల కోసం పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు గాలించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మొదటి బహుమతి పొందిన వ్యవసాయ శకటం, స్టాల్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు







ఉప్పొంగే శక్తి.. దేశభక్తి

భరతమాత గొప్పతనం చాటుతూ పాటలు, నృత్య రూపకాలు.. శకటాల అడుగులు.. సేవలకు ప్రశంసలు..జ్ఞాపికల అందజేత..ఆస్తుల పంపిణీ.. నడుమ త్రివర్ణ పతాకం మురిసింది. చిత్తూరు పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి గణతంత్ర వేడుకలు అంబరాన్ని అంటాయి. అందరిలో దేశభక్తిని నింపాయి.

- అలరించిన సాంస్కృతిక నృత్యాలు
- ఆకట్టుకున్న శకటాలు
- పరేడ్‌లో రూ.1897 కోట్ల ఆస్తుల పంపిణీ
- స్టాల్స్ సందర్శించిన కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన సంక్షేమ పథకాల శకటాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. రూ.1897 కోట్ల విలువ చేసే ఆస్తుల పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ శాఖ పరిధిలో బ్యాంక్ లింకేజీ కింద 15,060 ఎస్‌హెచ్‌జీలకు రూ.1429 కోట్లు, స్త్రీనిధి కింద 28,067 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.186 కోట్లు మొత్తం రూ.1,615 కోట్ల మెగా చెక్కును, మెప్మా ద్వారా బ్యాంక్ లింకేజీ కింద 1,921 ఎస్‌హెచ్‌జీలకు రూ.281 కోట్ల మెగా చెక్కును, విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా 10 మంది లబ్ధిదారులకు రూ.1.74 లక్షలతో ల్యాప్‌టాప్, ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు మొత్తం రూ.1,897 కోట్ల ఆస్తులను మెగా చెక్కుల రూపంలో కలెక్టర్ అందజేశారు. వివిధ శాఖల శకటాల ప్రదర్శనలో వ్యవసాయశాఖ మొదటి బహుమతి, విద్యాశాఖ ద్వితీయ బహుమతి, మున్సిపల్ శాఖ తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. ఆయా శాఖల అధికారులు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. సమగ్రశిక్ష శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వీరగాథ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, పద్యాల పోటీలను ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన నలుగురు విద్యార్థులకు రూ.2 వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేశారు. పరేడ్ మైదానంలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక నృత్యాలు

నగరంలోని వరదప్పనాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాల, విజయం విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లిటిల్ ఫ్లవర్ ఎడిట్ పాఠశాల, కస్తూర్బా బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాల, సీబీఎస్‌ఈ ఉన్నత పాఠశాల, ఆర్కే విద్యాలయ జూనియర్ కళాశాల, క్యాంఫోర్డు ఇంగ్లిష్ మీడియం పాఠశాల, రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. విద్యార్థులను కలెక్టర్ అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నగరంలోని గాబ్రియల్ పాఠశాలలో రెండో తరగతి చదివే విద్యార్థి అమీనా గణతంత్ర దినోత్సవ ఆంగ్ల ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఆ చిన్నారిని కలెక్టర్ అభినందించి జ్ఞాపిక అందజేశారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా జడ్జి భీమారావు, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

వీరుల త్యాగఫలంతోనే స్వేచ్ఛ



గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఎందరో వీరులు త్యాగఫలంతోనే మనకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు వచ్చాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసుల అన్నారు. గణతంత్రదినోత్సవం సందర్భంగా జెడ్పీ కార్యాలయంలో జెండా వందనం చేసి, స్వాతంత్ర సమరయోధుల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్ పర్సన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, పీఐయూ ఈఈ రమణయ్య, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ కార్యాలయంలో డీఐజీ గిరిబాబు జెండావందనం చేశారు. అనంతరం ఉద్యోగులు, ప్రజల పిల్లలకు విద్యాసామగ్రిని అందజేసి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ రిజిస్ట్రార్ ఉషారాణి, సబ్‌రిజిస్ట్రార్లు రహంతుల్లా, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ట్రాన్స్‌కో అర్బన్ కార్యాలయంలో ఈఈ పద్మనాభపిళ్లై జెండావందనం చేసి, ఉత్తమ ప్రతిభ చూపిన 50 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. డీఈ శేషాద్రి, ఏఈ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. మిట్టూరులో 1104 ట్రాన్స్‌కో ఉద్యోగుల సంఘం నాయకులు జెండావందనం చేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్వాసులు, గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.



రిపబ్లిక్ వేడుకలో గిరిబాబు